# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## యు.విశ్వేశ్వర రావు

### (విజయచిత్ర – 1975, అక్టోబర్ సంచిక నుంచీ)




“ఏ చిత్ర నిర్మాతయినా డబ్బుకోసమే చిత్ర నిర్మాణం చేస్తాడు; చెయ్యాలి. సినిమాలు తియ్యడం అనేది వ్యాపారం. కాబట్టి వ్యాపారంలో లాభాలు ఆశించడం సహజం. అయితే, ఈ వ్యాపార ధోరణి నుంచి కనీసం ఒక్కసారైనా బయటపడి, కొత్తతరహాగా, వ్యాపార దృష్టి లేకుండా చైతన్యవంతమైన చిత్రం తియ్యడం–ఇవాళ్టి రోజుల్లో అవసరం, విధాయకం. అందువల్లనే నేను, కేవలం వ్యాపార చిత్రాల్లాంటి భారీ చిత్రాలు తీసినా, ఇవాళ ‘తీర్పు’ లాంటి చిత్రమూ తీశాను. ఈ విధానంలో పరిశ్రమలో అప్పుడప్పుడు ఇలాంటి చిత్రాలు వస్తూ వుంటే, పరిస్థితి మారడానికి అవకాశం వుంటుంది.” అన్నారు యు. విశ్వేశ్వరరావు.

“అయితే వ్యాపార చిత్రాలూ నీతినీ సందేశాన్నీ చెబుతాయి; ఆ ధోరణిలో లేని చిత్రాలూ చెబుతాయి. చిత్ర కథనంలోనూ, చెప్పడంలోనూ తేడా వుంటుంది. అంతే!

కాని, ప్రతి నిర్మాతా ఎప్పుడూ ఇదే ధోరణిలో చిత్రాలు తీస్తూ వుంటే పరిశ్రమకు మనుగడ వుండదు. ఎంచేతంటే, ఈ రకమైన చిత్రాలు బాక్స్ ఆఫీస్ దగ్గర ‘హిచే’ కాలేవు. అందువల్ల సామాన్య ప్రేక్షకులను

దృష్టిలో వుంచుకుని, పుష్టిగా వినోదం కల్పిస్తూ, ఆ ధోరణిలోనూ చిత్రాలు తీస్తూ వుంటే – మధ్య మధ్యలో ఇలాంటివి తియ్యడానికి ఆస్కారం, అవకాశం వుంటాయి.

ఈ విధానం ఇవాళ మనకు చాలా గొప్పగా, కొత్తగా కనిపించవచ్చు. కాని, తక్కిన చాలా దేశాలవాళ్ళకి పాతదే. వాళ్ళు ఆ ధోరణిలోనే ఎక్కువగా చిత్ర నిర్మాణం చేస్తున్నారు. ఈ మధ్య నేను దాదాపు 80 విదేశీయ చిత్రాలు చూడడం తటస్థించింది. అవి చూసినప్పుడు నాకు అదే అనిపించింది – మనం ఎక్కడున్నాం? ఎక్కడికి పయనిస్తున్నాం?

కాని, ఒక్కసారే మన ధోరణి నుంచి బయట పడలేము; పడాలనుకోడం కూడా పొరపాటు. నిదానంగా అలవాటు పడాలి. మామూలు 'ఫార్ములా' ధోరణిని క్రమక్రమేణా మార్చడానికి ప్రయత్నించాలి. ఈ విధానం ఒకరు చెబితే వచ్చేదికాదు, దానంతట అది రావాలి; ఎవరికి వారికి తెలియాలి." అన్నారు ఆయన.

కంచుకోట, నిలువుదోపిడి, పెత్తందార్లు, దేశోద్ధారకులు, దాదాపు 15 (తెలుగు, తమిళం) డబ్బింగ్ చిత్రాలూ నిర్మించిన విశ్వేశ్వరరావు అభిప్రాయాలు, అభిరుచులూ గట్టివి. అలాంటి ఆత్మవిశ్వాసం మరీ గట్టిది. అలాంటి ఆత్మవిశ్వాసం ఏర్పడడానికి ముందు – ఆయనకు సినిమా పరిశ్రమ మీద ఏ మాత్రమూ ఉత్సాహం లేదు; నమ్మకమూ లేదు. కాని, విశ్వేశ్వరరావు బావగారైన దావులూరి రామచంద్రరావుగారు మాత్రం అతని మీద మంచి నమ్మకంతో వుండేవారు. ఆయన ప్రోద్బలమూ, ప్రోత్సాహమూ లేకపోతే – విశ్వేశ్వరరావుకు సినిమా పరిశ్రమ చాలా దూరంలో వుండేది.

విశ్వేశ్వరరావు కుటుంబం సంపన్నుల కుటుంబం. అయినా, పరిస్థితుల ప్రాబల్యం వల్ల విశ్వేశ్వరరావు బాల్య జీవితం అదోలా గడిచింది. తండ్రిగారు విశ్వేశ్వరరావుకు మూడో ఏడు నడుస్తున్నపుడే పోవటంతో, మేనమామగారే దగ్గరకు తీసుకుని పెంచారు. అతనికి ఎనిమిదో ఏడు వచ్చేవరకూ అక్షరాభ్యాసమే కాలేదు. మూడేళ్ళపాటు అలా సాగిన ఆ చదువు 'వానాకాలం చదువు' లాగా, ఆగిపోయింది. ఆ పదకొండేళ్ళ అబ్బాయి, కష్టపడి పనిచేస్తూ వ్యవసాయం చూసుకోవడం ఆరంభించాడు.

కాని బావగారు అతనిచేత బాగా చదివించాలని, 14వ ఏటనుంచి తిరిగి చదువులో ప్రవేశపెట్టారు. గోగినంపాడు నుంచి చదువు – ముదినేపల్లికి మారింది. ముదునేపల్లినుంచి, గుడివాడకూ (హైస్కూలు) గుడివాడనుంచి ఏలూరు, విజయనగరంలో బి. యస్. సి. పూర్తి చేసిన తర్వాత, గుడివాడ హైస్కూల్లో టీచర్ ఉద్యోగానికి వచ్చారాయన. తనకు చదువు చెప్పిన టీచర్ల పక్కనే తానూ ఒక 'సహోపాధ్యాయుడి' గా పనిచెయ్యటం వింతగా కనిపించింది. నేటి చిత్ర నిర్మాతలు ఎ.పూర్ణచంద్రరావు (దేవుడు చేసిన పెళ్ళి) రాఘవరావు (శారద) అప్పుడు ఆయన దగ్గర శిష్యులు.

విద్యార్థులకు పాఠాలు చెప్పడం, విద్య బోధించడంలో ఆయనకు 'థ్రిల్' కనిపించింది. ఇంకా బాగా చెప్పవచ్చునన్న ఆశయంతో జనతా ట్యుటోరియల్ ఇన్ స్టిట్యూట్ అన్న పేరిట గుడివాడలో ప్రైవేట్ కాలేజీ నడిపారు. తనదగ్గర చదువుకున్న వాళ్ళకు మంచి మార్కులు రావాలనీ, అందరూ ఉత్తీర్ణులు కావాలనీ ఆయన ఇరవైనాలుగు గంటలూ విద్యార్థులకు చదువు చెప్పడం సాగించడంతో – ఆయన ఆరోగ్యం దెబ్బ తిన్నది – అందువల్ల పెద్దలు కల్పించుకుని ఆ ఉద్యోగాన్ని, ఆపుజేయించవలసి వచ్చింది.

విశ్వేశ్వరరావుకు పై చదువులు చదువుకోవాలనీ, విదేశాలు వెళ్లాలనీ కోరికగా వుండేది; కాని మేనమామగారు నందమూరి నాగయ్యగారు (ఆయనే తర్వాత 'బావగారు' తర్వాత మామగారు కూడా అయ్యారు) 'సినిమా లైన్' లో విశ్వేశ్వరరావును పెట్టాలని ఆశించారు. అందుకు కారణం – వారి దగ్గర బంధువులైన కాజ వెంకట్రామయ్యగారు మొదలైన వారు సినిమా పరిశ్రమకు దగ్గరగా వుండడం.

విశ్వేశ్వరరావుకు సినిమాల మీద ఏ మాత్రం ఉత్సాహం లేదు. అతను సినిమాలు చూడడం కూడా చాలా అరుదు. సినిమాల మీద ఒక అభిప్రాయమూ, ఆలోచనాకూడా అతనికి లేవు. అంచేత 'ఆ ఫీల్డు నాకొద్దు' అనేవారు. కాని బావగారు ఒప్పుకోలేదు. విశ్వేశ్వరరావు జాతకంలో అతను కళలకు సంబంధించిన ఫీల్డులో రాణిస్తాడనివుందనీ, అందువల్ల సినిమాలకే పంపాలనీ ఆయన నిశ్చయించుకున్నారు. విశ్వేశ్వరరావును – పి. పుల్లయ్య గారు 'కన్యాశుల్కం' తీస్తున్న కాలంలో మద్రాసు తీసుకొచ్చి, ఆయన దగ్గర అసిస్టెంట్ జేర్చారు. కాని, ఆయనకేమీ ఉత్సాహం కనిపించలేదు. అంతా ఏదో గంద్రగోళంగా, తికమకగా వున్నట్టు కనిపించింది. 'కన్యాశుల్కం' అయిపోగానే, ఆ మాటే పుల్లయ్యగారితో చెప్పేసి – తిరిగి వెళ్ళిపోయారు. మళ్ళీ తనవూరు, తన వ్యవసాయం మొదలైనాయి.

అయితే విశ్వేశ్వరరావు మేనకోడలు పద్మిని "మామయ్యా – మీరు సినిమాలు తియ్యాలి; మంచి సినిమాలు తియ్యాలి" అంటూ వుండేది. అలాగే ఒక కథ కూడా ఇచ్చి 'ఇలాంటి కథలే సినిమాలు తియ్యాలి' అంటూ వుండేది. విశ్వేశ్వరరావు చిరునవ్వు నవ్వుకుని వూరుకునేవారు.

ఒకరోజు పత్రికలో ఒక ప్రకటన వచ్చింది – ఆంధ్రప్రభుత్వం సమాచార శాఖలో వుద్యోగాలున్నాయని. విశ్వేశ్వరరావు దానికి దరఖాస్తుచేసి, కర్నూలులో ఇంటర్వ్యూ వస్తే వెళ్ళారు. అప్పుడు గోపిచంద్ ఆ శాఖ డైరక్టర్ గా పదవి నిర్వహిస్తున్నారు. తన టర్న్ రాగానే విశ్వేశ్వరరావు. ఆయన్ని చూసి – తన దగ్గర వున్న సర్టిఫికెట్లు చూపారు. అందులో ఒక సర్టిఫికేట్ పుల్లయ్యగారు ఇచ్చినది. గోపీచంద్ అది చూసి – "నిన్ను నేను ఎన్నిక చెయ్యను" అన్నారు. విశ్వేశ్వరరావుకు అర్థం కాలేదు. "నువ్వు కష్టపడి పనిచేసేవాడివి – నీకు చిత్తశుద్ధి వుంది. లేకపోతే పుల్లయ్యగారంతటి వ్యక్తి నీ గురించి ఇలా రాయరు. నువ్వు వెళ్ళి సినిమాల్లోనే పని చెయ్యి" అని పంపేశారు – గోపీచంద్. అయితే, విశ్వేశ్వరరావు సినిమాలకి వెళ్ళలేదు; తిరిగి వ్యవసాయంలోకే వెళ్ళారు. వ్యవసాయంలో కష్టపడి, 'బాగా పండించాడు' అన్న పేరు తెచ్చుకున్నారు. అయితే దురదృష్టవశాత్తూ, ఆ సంవత్సరం గాలివానలు రావడమూ, అద్భుతమైన ఫలితాలు చూపిన విశ్వేశ్వరరావు పంట – నాశనమై పోవడమూ సంభవించాయి. దాంతో ఆయనకి ఒక విరక్తిలాంటిది ఏర్పడింది. మరి, ఏం చెయ్యాలి తను? –

వాసిరెడ్డి నారాయణరావుగారు, ప్రతిభాశాస్త్రిగారు కలిసి పుల్లయ్యగారి దర్శకత్వంలో 'జయభేరి' ప్రారంభిస్తున్నారు. బావగారికి ముగ్గురూ బాగా తెలుసు. అంచేత, ఎలాగైనా పట్టుబట్టి బావమరిదిని మళ్ళీ పంపాలని నిర్ణయించుకున్నారు రామచంద్రరావుగారు. పుల్లయ్యగారిచేత 'టెలిగ్రామ్' ఇప్పించి, బావమరిదిని మళ్ళీ మద్రాసు పంపారు.

'జయభేరి' తెలుగు, తమిళ భాషల్లో నిర్మాణంలో వున్నది. విశ్వేశ్వరరావు ఇదివరకు తనకున్న అనుభవానికి, చిత్తశుద్ధి కూడా జోడించి పనిచేశాడు. పుల్లయ్యగారు చాలా సంతోషించారు. "పోనీ, కొంతకాలం చెయ్యవయ్యా" అని ప్రోత్సహించారు. ఆయన ప్రారంభించిన 'వెంకటేశ్వర మహాత్మ్యం ' చిత్రానికి కూడా పని చేశారు విశ్వేశ్వరరావు.

అలా పనిచేస్తున్నా, విశ్వేశ్వరరావు వేరే ఏదైనా వ్యాపారం చెయ్యాలనిపించి, 'రియల్ ఎస్టేట్' మీదికి మనసు మళ్ళించారు. బావగారు ఒప్పుకోకపోవడంతో అది సాగలేదు.

సంగీత దర్శకుడు టి. వి. రాజు నిర్వహణలో 'బాలనాగమ్మ' చిత్రం జరుగుతున్న రోజులవి. విశ్వేశ్వరరావు ఉత్సాహం, వ్యాపారం మీద వున్న శ్రద్ధా చూసి – రాజుగారు ఆ చిత్రాన్ని తమిళం 'డబ్బింగ్' కు తీసుకోమని అడిగారు. ఈ వ్యాపారానికైతే బావగారి ప్రోత్సాహం లభిస్తుంది గనక, విశ్వేశ్వరరావు సరేనన్నారు. మేనమామ గారు డబ్బు ఇచ్చారు. అయితే ఆ చిత్ర నిర్మాణానికి మధ్యలో అంతరాయం కలగడం, విశ్వేశ్వరరావు తన పెట్టుబడికి నష్టం జరగకుండా వుండడానికి, తానే నిర్మాణ వ్యవహారాలు చేపట్టవలసి రావడం – జరిగాయి. అలా, ఆయన నిర్మాణ రంగంలో కాలుపెట్టారు; అనుభవం సంపాయించారు.

ఆ చిత్రం విడుదలై, లాభాలు తీసుకొచ్చింది. అందువల్ల, ఆయన అలా డబ్బింగ్ చిత్రాలు కొనసాగించాలనుకున్నాడు. తన సంస్థకు, 'విశ్వశాంతి' అన్న పేరు పెట్టడానికి ఒక కారణం వుంది. ఆయన మేనకోడలు పద్మిని, విశ్వేశ్వరరావుగారి వివాహ సందర్భంలో పావురం బొమ్మ గల ఫలకాన్ని బహుమతి ఇస్తూ "మీరు ఎప్పుడు కంపెనీ పెట్టినా – దీన్ని చిహ్నంగా వాడాలి సుమండీ" అన్నారు.

ఆమె కోరిక ప్రకారమే – విశ్వశాంతిని కోరే పావురాన్ని చిహ్నంగా ఉపయోగిస్తూ 'విశ్వశాంతి' అన్న పేరును తన సంస్థకు పెట్టారు.

విశ్వశాంతి ప్రారంభమైన తర్వాత తెలుగు, తమిళ భాషల్లో 15 డబ్బింగ్ చిత్రాలు తీశారు – విశ్వేశ్వరరావు, వీటిల్లో దాదాపు అన్నీ విజయవంతమైనవే.

ఈ డబ్బింగ్ చిత్రాల విజయం తర్వాత, విశ్వేశ్వరరావుకు 'స్థిరత్వం' ఏర్పడింది; మనో ధైర్యం, ఉత్సాహం కలిగాయి. తనకు ఇష్టం లేకపోయినా ఎలాగూ – ఈ పరిశ్రమలో స్థిరపడ్డారు కాబట్టి – ఇందులోనే కృషి చెయ్యాలన్న నిర్ణయానికొచ్చాడు.

తర్వాత కంచుకోట, నిలువుదోపిడీ, పెత్తందార్లు, దేశోద్ధారకులు మొదలైన భారీ చిత్రాలు నిర్మించి, నిర్మాతగా ప్రాముఖ్యం సంపాయించారు. అయితే ఆయన ఆశయాలు మాత్రం మారలేదు. అయితే ఆయన ఆశయాలు మాత్రం మారలేదు. సహజీవనం, సమజీవనం తొలినుంచీ ఆయన

ఆశయాలు. నవసమాజ నిర్మాణానికి నడుంకట్టడం ఆయన కోరిక. ఈ కోరికలు తీరే రోజుకోసం, ఆ ఆశయాలు సిద్ధింపజేసే కథలు గల చిత్ర నిర్మాణం కోసం ఆయన ఎదురుచూస్తూనే వున్నారు; పథకాలూ వేస్తున్నారు.

విశ్వేశ్వరరావుగారి మేనకోడలు పద్మినీరాజన్ ఇచ్చిన కథలో ఆయన ఆశించే ఆశయాలు ఉన్నాయి కాబట్టి, దాని మీదే బాగా కృషి చేసి, ఆ కథను సినిమాకు తగ్గట్టుగా మలిచారు. తనకుగా దర్శకత్వం వహించాలన్న కోరికలేదు. ఎవరిచేతనైనా చేయించాలి. కాని, వ్యాపార ధోరణిలో కనిపించని చిత్రం కాబట్టి, వ్యాపారాత్మకంగా అటూ ఇటూ అయితే, ఆ దర్శకుడి మనుగడకు అవాంతరం వాటిల్ల వచ్చునేమో – అని తానే అయితే, అపఖ్యాతో తానే భరించవచ్చు. తను ఎలాగూ దర్శకుడు కాదు; తను తక్కిన వారి చిత్రాలు డైరెక్టు చెయ్యబోయేదీలేదు; అందుకనే తానే దర్శకుడైనారు. శ్రీశ్రీకి తన కథ చెప్పారు; చర్చించారు; స్క్రిప్టు తయారు చేశారు. ఇందులోని పాటలన్నీ కూడా విశ్వేశ్వరరావే రాశారు.

"నాకు ఈ చిత్ర నిర్మాణం ఒక పాఠశాలలా కనిపించింది. కొత్త వాళ్లను పెట్టడంతో, వారి ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడంతో, వారికి శిక్షణ ఇవ్వడంతో ఎన్నో విషయాలు తెలిశాయి" అన్నారు.

ఆయనకు 'గ్రహ బలం' మీదా 'ప్రాప్తం' మీదా నమ్మకం ఎక్కువ. ఆ గ్రహబలమే తనను ఇవాళ పరిశ్రమలో నిలబెట్టిందనీ, 'ప్రాప్తం' ఎలా వుంటే అలా జరుగుతుందనీ ఆయన విశ్వాసం.

'తీర్పు' చిత్రం – తెలుగు పరిశ్రమలో కొంత సంచలనం కలిగించింది. విడుదల కాకముందే పేరు తెచ్చుకున్నది; విడుదలకు ముందే పలుదేశాల మన్ననలు పొందింది; పలుదేశాలకు పయనించింది; ఆంధ్రప్రభుత్వం చేత వినోదపు పన్ను రద్దు చేయించుకున్నది. విడుదలకు ముందే రాష్ట్ర ప్రభుత్వ బహుమతిని పొందింది.

"ఈ విధానం భారతదేశంలోనే కొత్త. వినోదపు పన్ను రద్దు అంటే – కేవలం పన్నును మాత్రమే రద్దు చెయ్యడం కాదు. కింది తరగతి తప్ప, తతిమ్మా తరగతులన్నీ 'ఒక్క రూపాయి' తోనే చూడవచ్చును. కింది తరగతి అర్ధరూపాయితో చూడవచ్చును. ఈ విధానానికి 'తీర్పు' చిత్రమే భారతదేశంలోనే దారి చూసింది" అన్నారాయన.

'తీర్పు' లాంటి చిత్రాలు ఇంకా రావాలనీ, వస్తాయనీ, ఆయన గాఢంగా నమ్ముతారు. కంచుకాగడా, దశావతారాలు మొదలైన, భారీ చిత్రాలకు 'స్క్రిప్టులు' ఆయన దగ్గర సిద్ధంగానే వున్నా, 'కోర్తి, కాంత– కనకం' వంటి ప్రయోజనాత్మక చిత్రాలకు కూడా కథలు ఆయన దగ్గర సిద్ధమయ్యే వున్నాయి. 'వ్యాపారమూ వుండాలి; కళా వుండాలి. రెండూ కలిస్తేనే సినిమా' అన్న అభిప్రాయం గల విశ్వేశ్వరరావు నిర్మాతల సంఘంలో కూడా ప్రముఖంగా కృషి చేస్తున్నారు...

COMMENTS

-